క్లుప్తంగా

కులగణన చేపట్టాలి

తెనాలిఅర్బన్: కుల గణన చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ ఆరోపించారు. మార్కెట్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు బ్యాంకు వాడుకునే రాజకీయ పార్టీలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో బీసీ కులాలు ప్రాధాన్యం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలని కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించవద్దు

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరు ఉపయోగించడం కానీ, అమ్మడం కానీ చేయవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో శనివారం పలు దుకాణాలను తోపుడుబళ్లను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న పలువురు వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసం కొనుగోలు చేసే వారు తప్పని సరిగా స్టీల్ బాక్సులు ఉపయోగించాలని సూచించారు. అలాగే క్లాత్, జానపనార సంచులను ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ వి.రవీంద్ర, ఎస్.బాబూరావు, వి.విజయచంద్ర, టి.సుష్మ, కె.నాగజ్యోతి పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై ప్రధాని మోదీ ఫొటో ముద్రించాలి

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో వేయాలని బీజేపీ యువ మోర్చా నాయకులు శనివారం ఆర్డీఓ కార్యాలయ ఏవో వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. యువమోర్చా జిల్లా అధ్యక్షులు మైలా హరికృష్ణ మాట్లాడుతూ 60 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని, డిసెంబర్ 2వ తేదీ లోగా ప్రతి రేషన్ వాహనంపై మోదీ ఫొటో ముద్రించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రుద్రు శ్రీనాథ్, లీలారామ్, చంద్ర, బాలాజీ, నాగార్జున, లీలా ఫణీకృష్ణ పాల్గొన్నారు.

రైలు పట్టాలు దాటేప్పుడు అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఏఎస్ఐ శివరామకృష్ణయ్య

తెనాలిరూరల్: రైలు పట్టాలు దాటి వెళుతున్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాపట్ల జిల్లా చుండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు తెనాలి ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎం.శివరామకృష్ణయ్య, సిబ్బంది శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులు పట్టాలు దాటి వెళ్తూ రైలు ప్రమాదాల్లో ప్రాణాలూ పోగొట్టుకుంటుంటారు. ఈ క్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది కౌన్సెలింగ్ ఇస్తూ గేటు లేని చోట రైలు పట్టాలు దాటడం ప్రమాకరమని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైళ్లపై రాళ్లు విసురుతున్న ఘటనలపై ఇటీవల కాలంలో కేసులు నమోదు చేస్తున్నామని, రైల్వే యాక్టు కింద నమోదయ్యే కేసులో బెయిల్ రాదని తెలిపారు. రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం తీవ్ర నేరమని చెప్పారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.బాబూరావు పాల్గొన్నారు.

ముగిసిన పాన్ ఇండియా కార్యశాల



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాన్ ఇండియా వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ఆన్‌లైన్ ద్వారా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆధునిక టెక్నాలజీ రంగంలో కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచానికి భారత్ దిక్సూచి కావాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలు చేసేలా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని కోరారు. పాన్ ఇండియా కార్యశాల కన్వీనర్లు ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పాండియన్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ సెంథిల్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్), ఐ ట్రిపుల్ ఈ ఇండియా కౌన్సిల్, ఎలక్ట్రానిక్స్ మరియు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో కేఎల్‌యూలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యశాలలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, ప్రొఫెసర్ హరి కిరణ్, కార్యక్రమ కో ఆర్డినేటర్లు స్వప్న, ఆర్‌బీఆర్ ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ 41వ సబ్‌జూనియర్, 6వ కాడెట్ తైక్వాండో చంపియన్‌షిప్ పోటీలు శనివారం సాయంత్రం తెనాలిలోని జేఎంజే మహిళా కాలేజీలో ఆరంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. సబ్‌జూనియర్, కాడెట్ రెండు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలు రెండురోజులపాటు జరుగుతాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు పొందిన క్రీడాకారులు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో డిసెంబరులో జరగనున్న జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆర్గనైజర్ బి.దానేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర అసోసియేషన్ ట్రెసర్ అర్జునరావు, ఉపాధ్యక్షుడు అచ్చంనాయుడు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు, కౌన్సిలర్ అనిల్ పాల్గొన్నారు.

26న ఆర్యవైశ్య సంఘాల వన సమారాధన

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 26న ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం ఆవిష్కరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించనున్న వనసమారాధన వివరాలను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, అర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం వెల్లడించారు. ఆరోజు ఉదయం 11 గంటల్నుండి వన సమారాధన ఆరంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొల్లా గురునాథగుప్తా, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు చుండూరు సాయి, లీగల్ సెల్ కమిటీ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, ఆధ్యాత్మిక సేవ కమిటీ అధ్యక్షుడు చుండూరి వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగాలు



దావులూరులో వరి పంటకోత ప్రయోగాలు చేస్తున్న యూనిట్ ఇన్‌చార్జి కె.పరిశుద్ధ కుమారి

దావులూరు(కొల్లిపర): మండలంలో దావులూరులో ప్రకృతి వ్యవసాయం క్షేత్రంలో వరి పంట పొలంలో శనివారం ప్రకృతి వ్యవసాయం దావులూరు యూనిట్ ఇన్‌చార్జి కె.పరిశుద్ధ కుమారి ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు గొట్టిముక్కల శ్రీధర్ పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో పంట తొలగించగా 18కేజీలు 200గ్రాములు వడ్లు తూకం రాగా వచ్చిన బరువును సరాసరి ఎకరానికి అంచనా వేయగా 39బస్తాల 300 గ్రాములు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వరి పంటలో ఇంత దిగుబడి రావటానికి ముఖ్య కారణం వేసవిలో భూమిపై పంటలు లేని సమయంలో భూమిలో వివిధ పోషకాలు పెరగటానికి జీలుగా, పిల్లిపెసర తోపాటు 30 రకాల విత్తనాలు వేసి రబీ సాగుకు ముందు 30 రకాల మొక్కలను భూమిలో కలసే విధంగా నాగలితో దున్ని అనంతరం ఘన జీవామృత్తం, ద్రవజీవామృతం, అగ్నాస్త్రం, పుల్లటి మజ్జిగ మొదలగు కషాయాలు వరి పంటలో వాడటం వలన తక్కువ ఖర్చుతో అధిక దిబడి సాధించవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు పి.ప్రసన్నకుమారి, ఎస్.విజయకుమార్, కె.శివగంటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన శనివారం రాత్రి తెనాలి మండలం కఠెవరం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గుంటూరుకు చెందిన మెడికల్ రిప్రజంటేటివ్‌లు హేమంత్, తేజ శనివారం తెనాలి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కఠెవరం వద్దకు రాగా ఎదురుగా వచ్చిన బైక్ వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురూ గాయాలపాలయ్యారు. వీరితో పాటు గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని నారాయణ కాలేజీలో విద్యార్థుల తల్లిల్లిదండ్రులకు అవగాహన సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ పవన్ అధ్యక్షత వహించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కొన్ని అవాంఛనీయ ధోరణులు కనిపిస్తున్నందున విద్యార్థులు చెడు వినకు, చెడు మాట్లాడకు అన్నట్టుగా చదువుపైనే దృష్టిపెట్టేలా చూడాలని చెప్పారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని బిడ్డలకు సూచించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందనే భావనను విద్యార్థుల్లో ప్రేరేపించాలని చెప్పారు. నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని, మన ఆచార సంప్రదాయాలను అనుసరించేలా చూడాలని కోరారు. గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్‌కుమార్, కాలేజి ఏఓ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ పోతురాజు పాల్గొన్నారు.

శాఖాగ్రంథాలయంలో సైన్స్ ప్రాజెక్టు పోటీలు



చిన్నారులతో గ్రంథాలయ సంస్థ అధికారులు



తనిఖీ చేస్తున్న పీర్ అహ్మద్

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో శనివారం సైన్స్ ప్రాజెక్టు పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్, సెక్రటరీ కె.ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 20 మంది సంద్ర కోటేశ్వరరావు సహకారంతో గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్నారు. గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలువోలు సుబ్బారావు, ఎం.అన్నారావు, శ్రీరామమూర్తి, లక్ష్మీనారాయణ, ఏస్తేరు పాల్గొన్నారు.

■ నందివెలుగు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కథల పోటీలు నిర్వహించారు. వివిధ కథలు, హావభావాలతో పోటీలు జరిపారు. గ్రంథాలయాధికారిణి బొల్లు మాధవి పర్యవేక్షించారు. విక్టోరియా స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

తెనాలి: రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్ శనివారం తెనాలిలోని ప్రథమశ్రేణి గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పర్యవేక్షకులైన పీర్ అహ్మద్, గ్రంథాలయంలో అయా కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను తెలుసుకున్నారు. 20వ తేదీ వరకు చేపడుతున్న అంశాలపై అవసరమైన సూచనలు చేశారు. వీరితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి ఉన్నారు. తెనాలి గ్రంథాలయం అధికారి కావూరి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరులోని శాఖా గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్‌అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. గ్రంథలయంలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయంలో వసతుల గురించి ఆరా తీశారు గ్రంథాలయాధికారి ఎ.రాఘవేంద్రరావుకు పలు సూచనలు చేశారు.

తైక్వాండో పోటీల్లో పలువురికి బంగారు పతకాలు



పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సునీల్, సాంబశివరావు, శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: ఏపీ తైక్వాండో అంతర్ జిల్లాల చాంపియన్ షిప్ పోటీల్లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి విద్యార్థులు పలువురు స్వర్ణ, రజత పతకాలు సాధించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను ఈ నెల 14, 15 తేదీల్లో రేపల్లెలో నిర్వహించినట్లు చెప్పారు. అండర్–14 విభాగంలో డి.సాయిహర్షిత్, టి.హరిణీ అండర్–12 విభాగంలో, టి.సిద్ధు, టి.అభిరామ్, పి.కృతిక ఆరాధ్య, సూక్ష్మ శ్రీ, మోక్ష విందలు స్వర్ణ పతకాలు సాధించినట్లు చెప్పారు. మరో తొమ్మిది మంది రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. శనివారం తెనాలిలోని అకాడమిలో పతకాలు సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన అభినందించారు. కార్యక్రమంలో ఎ.సునీల్, సాంబశివరావు, కె.రామారావు, కె.రోహిత్ వర్మ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే శారీరక, మానసిక సమస్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.రవికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ప్రభావం చూపుతుందని, ముందు జాగ్రత్తతోనే మాదక ద్రవ్యాల అలవాటు మరియు ఆలోచనలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, ఉపాధ్యాయులు జి.శివ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అగౌరవం, వ్యంగ్యంగా పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు



గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నటుడు పోసాని కృష్ణమురళి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజులపై ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి వ్యంగ్యంగా, అగౌరవంగా పోస్టులు పెట్టడంపై న్యాయవాదులు అరండల్‌పేట పోలీసుస్టేషన్ శనివారం ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయవాది వేముల ప్రసాద్ మాట్లాడుతూ అడుసుమల్లి వెంకట అప్పారావు ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి, ఐజీ, సినీనటుడు పోసాని కృష్ణమురళిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టి అగౌరపరిచాడని తెలిపారు. ఒక రాజకీయ పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశారని పేర్కొన్నారు. వెంకట అప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టర్లు పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బి.కోటేశ్వరరావు, సీడీ భగవాన్, క్రాంతికుమార్, జయపాల్, శ్రీనివాసరెడ్డి, షేక్ నజీర, కృష్ణారెడ్డి స్టేషన్‌కు వచ్చిన వారిలో ఉన్నారు.

క్రికెట్ వరల్డ్ కప్ భారత్‌దే

- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఆశాభావం
- సంగంజాగర్లమూడి స్కూల్ సందర్శన



విద్యార్థులతో క్రికెట్ ఆడుతున్న రాయుడు

తెనాలిరూరల్: భారత్– ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో టీమ్ ఇండియా ఘన విజయం సాధిస్తుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. రాయుడుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం ఎ.శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో అంబటి రాయుడు మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో క్రికెట్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులందరూ కలిసి అంబటి రాయుడును సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. అంతకు ముందు గ్రామంలోని సంగమేశ్వరస్వామి దేవస్థానంలో రాయుడు పూజలు చేశారు. సాయంత్రం గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి అక్కడి వసతులను పరిశీలించారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అవకాశమున్న కేసులు ఎక్కువ పరిష్కారమయ్యేలా చూడాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ కోరారు. డిసెంబర్ 9వ తేదీ నిర్వహించనున్న లోక్‌అదాలత్‌పై న్యాయవాదులతో శనివారం సమావేశమయ్యారు. మోటారు వాహన చట్టంలో సుప్రీం కోర్టు చేసిన సవరణల గురించి వివరించారు. సివిల్ అప్పీల్ 9322/2022 కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు రోడ్డు ప్రమాద బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం త్వరితగతిన అందేలా, కేసులు సత్వర పరిష్కారానికి దోహదపడుతోందని తెలిపారు. రాజీ అవకాశమున్న సివిల్ క్రిమినల్, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్



విద్యుత్ వినియోగదారుల సమస్యలు వింటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

రాయపూడి(తాడికొండ): విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో వినియోగదారుల సమస్యలు అక్కడికక్కడే సత్వర పరిష్కారం లభిస్తుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మాన్యుయేల్ అన్నారు. శనివారం తుళ్లూరు మండలం రాయపూడి విద్యుత్ చేతన్ కాన్ఫెరెన్స్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక బిల్లులు, తప్పుడు రీడింగ్ బిల్లులు, సర్వీసుల్లో జాప్యం, లో బడ్జెట్ సమస్యలు, సరఫరాలో హెచ్చుతగ్గులు, పోల్స్ సమస్యలు ఉన్న 8 మందికి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ సాంకేతిక సభ్యులు కె.వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు ఎ.సునీత, సీఆర్డీయే సర్కిల్ ఎస్ఈ పి.విజయ్ కుమార్, అమరావతి ఈఈ టీవీ తులసీ రామ్ పాల్గొన్నారు.

బాలోత్సవాల బ్రోచర్ల పంపిణీ



పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు బాలోత్సవం బ్రోచర్‌ను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: డిసెంబర్‌లో జరుగనున్న బాలోత్సవాల బ్రోచర్లను శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని పలు పాఠశాలలకు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 19,20 తేదీల్లో మంగళగిరి సమీపంలోని డాన్‌బాస్కో హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిట్రా రామారావు, రాజు మాస్టర్, జ్యోతిపాల్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్



తాడికొండ: విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా చదువుతో పాటు సామాజిక స్పృహ, దేహ ధారుఢ్యం పెంపొందించుకొని ఉన్నతంగా రాణించవచ్చని గుంటూరు హెడ్ క్వార్టర్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కల్నల్ చంద్రశేఖర్ అన్నారు. తాడికొండ మండలం లాం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, ప్రియాంక పాల్గొన్నారు.

ఇప్పటంలో రేషన్ షాపు తనిఖీ



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో రేషన్ దుకాణాన్ని డీఎస్‌ఓ కోమలి పద్మ శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు రేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంత కాలంగా ఇప్పటంలో 21వ రేషన్ షాపు నిర్వహిస్తున్న శివరమణ కుమారి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు ఇస్తామంటూ చెబుతోందని, జరిగిన ఈ ఘటనపై కొందరు ఫిర్యాదు చేయడంతో షాపు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ షాపులో లబ్ధిదారులకు ఇవ్వకుండా మిగిల్చిన బియ్యం 900 కేజీలు గుర్తించినట్లు పేర్కొన్నారు. పంచదార అర కిలో ప్యాకెట్లు 150 గుర్తించి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో మంగళగిరి సీఎస్‌టీడీ దుర్గారావు, వీఆర్‌ఓ ప్రసాద్ పాల్గొన్నారు. తనిఖీ ప్రాంతంలో వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వని వారిని కలిసి వివరాలు సేకరించారు.

వడ్డెరలను అవమానించిన టీడీపీ క్షమాపణలు చెప్పాలి

మంగళగిరి: బీసీలను అవమానపరచడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందని వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల కృష్ణ కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని వడ్డెరలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వడ్డెరలను నమ్మలేమంటూ బీకే పార్థసారథి అవమానపరడం సిగ్గుచేటన్నారు. 2019 తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వడ్డెరలను ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించడంతో వడ్డెరలు రాజకీయంగా ఎదుగుతున్నారనే అక్కసు తట్టుకోలేక పార్థసారథి వడ్డెరలను కించపరచేలా మాట్లాడారన్నారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనకు విద్య నేర్పిన గురువు వెంకటప్పయ్య, వడ్డెర అయినా ఆయన పేరుతో స్కూలు స్థాపించి వడ్డెరలకు గౌరవం కల్పించారన్నారు. వడ్డెరలకు పదవులు కేటాయించి ఉన్నత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న 2024 ఎన్నికలలోను రాష్ట్రంలోని వడ్డెరలంతా అండగా ఉండి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, ఈమని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీబీ తెనాలి యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ ఐటీసీ కంపెనీ మరియు నాట్కో వారి ఆర్థిక సహకారంతో జిల్లా క్షయ నివారణ అధికారుల సూచనల మేరకు క్షయ వ్యాధి గ్రస్తులకు కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బారావు, సీహెచ్‌ఓ ఎ.జానమ్మ, ఈమని మెడికల్ ఆఫీసర్–2 డాక్టర్ ఎ.సుకన్య, దుగ్గిరాల పాల్గొన్నారు.